క్లుప్తంగా

లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం 2023–24 సంవత్సరానికి గాను నూతన కమిటీ ఎన్నిక కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా షేక్ దస్తగిరి, కార్యదర్శిగా లగడపాటి రమేష్, ట్రెజరర్‌గా చెరుకు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు పూర్వ అధ్యక్షుడు మన్నెం జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోనేరు పూర్ణచందర్‌రావు మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఏర్పడి 57 సంవత్సరాలు అయిందని, క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజల మన్ననలు పొందుతున్నామని పేర్కొన్నారు. ఎన్నుకున్న నూతన బాడీ ఈ సంవత్సరంలో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు అముదాల వెంకటనర్సయ్య, పాండురంగారావు, మోడె మోహనరావు, మైనేని మోహనరావు, కూర శ్రీధర్ పల్లపోతు వాసు, శశికిరణ్, కుక్కడపు వెంకన్న, పోతుకుచ్చి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ కమిటీ ఎన్నిక


పి.మహేష్, అధ్యక్షుడు


జి.వీరభద్రం, కార్యదర్శి

జూలూరుపాడు: పాపకొల్లు క్రాస్ రోడ్ ఆటో అడ్డా ఆటో వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడిగా పత్తిపాటి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జూలూరుపాడులో ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పత్తిపాటి మహేష్, కార్యదర్శిగా గార్లపాటి వీరభద్రం, ఉపాధ్యక్షుడిగా మోదుగు దానేయేలు, కోశాధికారిగా కనకపుడి నరసింహారావు, సహాయ కార్యదర్శులుగా నిమ్మటూరి లచ్చయ్య, ఎస్కే బుడేన్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

జూలూరుపాడు: స్థానిక సొసైటీ కార్యాలయంలో పచ్చిరొట్ట(జీలుగులు) విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతూ.. జీలుగుల విత్తనాలను బుధవారం నుంచి విక్రయించనున్నట్లు తెలిపారు. 30 కేజీల బ్యాగ్ ధర రూ 842.70 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావల్సిన రైతులు ఆధార్ కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్‌లను సొసైటీలో అందజేసి తీసుకోవాలన్నారు.

బాధ్యతలు చేపట్టిన మెడికల్ ఆఫీసర్


డాక్టర్ శ్రీదేవి

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్‌గా బి.శ్రీదేవి మంగళవారం విధుల్లో చేరారు. ఆరేళ్లుగా మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయుష్ సేవలు నిలిచిపోయాయి. ఎట్టకేలకు ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో శ్రీదేవిని నియమించగా తిరిగి ఆయుష్ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

నెరవేరని ప్రజల ఆకాంక్షలు..


మాట్లాడుతున్న కోటేష్

ఇల్లెందురూరల్: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చని ప్రభుత్వానికి ఉత్సవాలు జరిపే హక్కులేదని ప్రజాపంథా సబ్‌డివిజన్ నాయకుడు ఇస్లావత్ కోటేష్ అన్నారు. మండలంలోని బోయితండా గ్రామంలో మంగళవారం ప్రజాపంథా ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇల్లు, రుణమాఫీ, రేషన్‌కార్డులు, నిరుద్యోగ భృతి ఇలా.. అనేక వాగ్దానాలను తుంగలో తొక్కి ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ గారడీ మాటలతో ప్రజల ముందుకు ఉత్సవాల పేరుతో వస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ అబద్ధపు మాటలను ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమావేశంలో భూక్యా రవి, బోడ శంకర్, బాలాజీ, శంకర్, సురేష్, బుజ్జి, బోడ విజయ, శాంత తదితరులు పాల్గొన్నారు.

కొంగుబంగారం అంకమ్మతల్లి

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- ఐదురోజులు వేలాదిగా రానున్న భక్తులు


అనంతబండారిని తీసుకొస్తున్న పూజారులు(ఫైల్) (ఇన్‌సెట్) ఆలయంలో అంకమ్మతల్లి

సుజాతనగర్: భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా రాఘవాపురం గ్రామంలోని అంకమ్మతల్లి వెలుగొందుతోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుంటారు. అమ్మవారి దయతోనే గ్రామంలో కరువు, కాటకాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని గ్రామస్తులు నమ్ముతుంటారు. నిష్ఠతో అమ్మవారిని పూజిస్తే కరుణిస్తుందని ప్రతి రెండేళ్లకోసారి గ్రామంలో వైభవంగా జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

అమ్మవారి చరిత్ర ..

గ్రామంలో కొలువై ఉన్న అమ్మవారికి సుమారు 25 ఏళ్ల చరిత్ర ఉంది. ఒకప్పుడు రాఘవాపురం గ్రామం కరువు కాటకాలతో అల్లాడుతుండగా.. గ్రామానికి చెందిన దారా వంశస్తులు బూర్గంపాడులో ఓ వివాహానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ జరిగిన అంకమ్మతల్లి ఉత్సవాల సందర్భంగా రాత్రి వేళలో సదరు దంపతులకు అంకమ్మతల్లి కలలో ప్రత్యక్షమైందట. తమ గ్రామంలో అంకమ్మతల్లిని ప్రతిష్ఠించుకుంటే గ్రామ సమస్యలు తొలగిస్తానని చెప్పినప్పటికీ దంపతులు పట్టించుకోకపోవడంతో ఆ ఏడాది గ్రామంలో ప్రజలకు అధికంగా వ్యాధులు ప్రబలాయని అంటుంటారు. ఆ తరువాత ఓ రుషి కూడా అమ్మవారిని ప్రతిష్ఠించాలని చెప్పడంతో నాటి నుంచి అమ్మవారిని నెలకొల్పి రెండేళ్లకోసారి జాతర నిర్వహిస్తున్నట్లు పెద్దలు చెబుతుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 8వ తేదీ నుంచి 12 వరకు ఐదు రోజుల పాటు అంకమ్మతల్లి జాతరను భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించనున్నారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

వీరతాడు, వసంతోత్సవం ప్రత్యేకం...

అంకమ్మతల్లి జాతరలో ముఖ్యమైన ఘట్టాలైన కొల బియ్యం, వీరతాడు, అనంత బండారు, వసంతోత్సవం, కొర్లబండి, పూలకప్పెర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి అమ్మవారిని కొర్లబండిపై సాగనంపుతారు. ఈ జాతరలో వీరతాడు, వసంతోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. జాతరలో మూడు రోజుల పాటు ప్రత్యేకంగా పూజించిన బియ్యాన్ని ప్రతిరోజూ కొలుస్తారు. మొదటి రోజు కొలిచిన బియ్యం చివరి రోజు రెట్టింపవుతాయి. అమ్మ కరుణ వల్లనే ఇలా జరుగుతుందని భక్తులు నమ్ముతారు.

మహిమగల తల్లి



అంకమ్మ తల్లి ఎంతో మహిమ గలది. 250 సంవత్సరాలుగా భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతోంది. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ జాతరను భక్తిశ్రద్ధలతో చేస్తుంటాం. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు.

– లోశెట్టి నాగార్జున్, రాఘవాపురం

అమ్మవారికి ప్రత్యేక పూజలు



8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించబోయే జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయి. అమ్మవారు కరుణిస్తేనే పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తుల నమ్మకం. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

– కలవాల నాగయ్య,రాఘవాపురం

జాతరకు ఏర్పాట్లు పూర్తి



ఐదు రోజుల పాటు నిర్వహించనున్న జాతర సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలి.

– కోరుబోయిన రామారావు, పూజారి

'కార్పొరేట్'కు దోచిపెడుతున్న ప్రధాని


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

జూలూరుపాడు: దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు ప్రధాని నరేంద్ర మోదీ దోచిపెడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు విమర్శించారు. మంగళవారం మాచినేనిపేటతండాలో ఈనెల 11న జిల్లా కేంద్రం కొత్తగూడెంలో జరగనున్న సీపీఐ ప్రజాగర్జన సభ విజయవంతం కోసం ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికై లక్షలాది మంది ప్రజలను చైతన్య పరిచేందుకే ప్రజాగర్జన సభను నిర్వహిస్తున్నామని, ఈ సభను జయప్రదం చేసేందుకు పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్‌పాషా, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ, గుగులోత్ కీర్యా, వెంకటేష్, సంతోష్, వీరన్న, శ్రీను, ముత్తులింగం, భద్రం పాల్గొన్నారు.

సస్పెండ్ చేసే అధికారం లేదు..

టేకులపల్లి: మా తాతముత్తాతల కాలం నుంచి మూడు తరాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేస్తున్నామని, నా కూతురు కాంగ్రెస్ పార్టీ నుంచి వార్డు సభ్యురాలిగా గెలిచిందని, అలాంటి నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అధికారం మండల అధ్యక్షుడు దేవానాయక్‌కు లేదని సీనియర్ నేత గుండా నరసింహారావు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు.

పార్టీకి ద్రోహం చేసే వ్యక్తిత్వం తమది కాదని తెలిపారు. దేవానాయక్ సోదరుడు బీఆర్‌ఎస్‌లో ఉన్నాడని, సర్పంచ్ ఎన్నికల్లో సొంత పార్టీకి ద్రోహం చేసి తన అన్నకు మద్దతు తెలిపిన ఘనత దేవానాయక్‌దని, ఒంటిద్దు పోకడలకు పోయి పార్టీని బలహీన పరుస్తున్నాడని విమర్శించారు. కొత్త కమిటీలు చెల్లవని పాత కమిటీలే అమలులో ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ దీని ప్రకారం తానే మండల అధ్యక్షుడినని పేర్కొన్నారు. ఇప్పటికైనా దేవానాయక్ కళ్లు తెరిచి ఆత్మ విమర్శ చేసుకోవాలని, తన సస్పెన్షన్ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరారు.

అవినీతిపై విచారణ జరిపించాలి


నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: టీఎస్పీఎస్సీలో జరిగిన అవినీతిపై సీబీఐచే విచారణ జరిపించాలని, ప్రస్తుత టీఎస్పీఎస్సీ సభ్యులను తొలగించిన తర్వాతే గ్రూపు–1 పరీక్షలు నిర్వహించాలని, టీఎస్పీఎస్సీ కార్యాలయం ఎదుట శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న బీఎస్పీ నాయకులను అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు తరలించడం హేయమైన చర్య అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన బీఎస్పీ నాయకులను విడుదల చేయాలనే డిమాండ్‌తో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టాఫీసు సెంటర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఎస్పీఎస్సీలో పేపర్ లీకేజీ జరిగి 35 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న టీఎస్పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించకుండా మళ్లీ వాళ్లతోనే పరీక్షలు నిర్వహించడం వల్ల నిరుద్యోగులు ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈ లీకేజీ కుంభకోణంలో కేసీఆర్ కుటుంబ సభ్యుల పాత్ర ఉందని ఆరోపించారు. పరీక్షల నిర్వహణపై గవర్నర్ స్పందించి టీఎస్పీఎస్సీలో కొత్త సభ్యులను నియమించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సలహాదారు గంధం మల్లికార్జునరావు, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు సాయి, జిల్లా కార్యదర్శులు చెనిగారపు నిరంజన్‌కుమార్, మాలోత్ వీరునాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో చిన్నారుల నృత్య ప్రదర్శన


విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన విద్యుత్ ఉత్సవ సంబురాల్లో కొత్తగూడెంకు చెందిన పలువురు విద్యార్థినులు చేసిన నృత్యం సభికులను ఆకట్టుకుంది. యోగా, డ్యాన్స్ ఇన్‌స్ట్రక్టర్ త్రివేణి పారిస్ వద్ద శిక్షణ పొందిన విద్యార్థినులు చేసిన నృత్యం ఆహుతులను అబ్బురపరిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, ట్రాన్స్‌కో జెన్‌కో చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు తదితరులు విద్యార్థినులను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇల్లెందు: ఇల్లెందు మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో పలు గ్రూపులలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఎంపీసీ, బైపీసీలో కొన్ని సీట్లు పరిమితంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ముగిసిన నామినేషన్లు

కొత్తగూడెంఅర్బన్: భద్రాచలం రోడ్డు రైల్వే ఇన్‌స్టిట్యూట్ 2023 మేనేజింగ్ కమిటీకి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ముగిసింది. మంగళవారం చివరిరోజు కావడంతో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బీడీసీఆర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో అన్ని పోర్ట్‌పోలియోలకు నామినేషన్లు దాఖలు చేసినట్లు యూనియన్ జిల్లా కార్యదర్శి జేమ్స్ పాల్ తెలిపారు. నామినేషన్ పత్రాలను ఏరియా ఆఫీసర్, ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ రజినీష్‌కుమార్ మీనన్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ప్యానల్ సభ్యుల వివరాలు వెల్లడించారు. జూన్ 30న ఈ ఎన్నికలు జరుగనున్నాయి. సంఘ్‌తో పాటుగా మజ్దూర్ యూనియన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ వారు నామినేషన్లు దాఖలు చేశారు.

రివ్యూ మీటింగ్‌కు హాజరుకండి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావుతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో జరగనున్న రివ్యూ మీటింగ్‌కు హాజరు కావాలని జిల్లా వైద్య, ఆరగ్యోశాఖ అధికారి జేవీఎల్.శిరీష తెలిపారు. మంగళవారం హెల్త్ వెల్‌నెస్ సెంటర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు, మెడికల్ ఆఫీసర్లతో డీఎం అండ్ హెచ్‌ఓ జూమ్ మీటింగ్‌లో మాట్లాడారు. మంత్రి హరీష్‌రావుతో జరగనున్న రివ్యూ మీటింగ్‌కు మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు హాజరు కావాలని, ఎవరూ గైర్హాజరు కావద్దని సూచించారు.

నేడు సాగునీటి దినోత్సవం


చల్లసముద్రం పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు, సర్పంచ్ చుక్కమ్మ

ఇల్లెందు: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం నీటి పారుదల ఆధ్వర్యాన సాగునీటి దినోత్సవాన్ని ఇల్లెందులో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇల్లెందులపాడు చెరువు మినీ ట్యాంక్ బండ్ మీద ఇల్లెందు నియోజకవర్గం సాగునీటి దినోత్సవం బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ భాగ్యరాజ్ రాథోడ్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, రైతులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల8న ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ బాలరాజు పిలుపునిచ్చారు. మండలంలోని చల్లసముద్రం పెద్ద చెరువును స్థానిక సర్పంచ్ తాటి చుక్కమ్మతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. చెరువు వద్ద సమావేశం నిర్వహించడంతోపాటు గ్రామంలోని ప్రతిరైతు, మత్స్యకారులు విధిగా హాజరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

పారిశ్రామిక ప్రగతిలో ముందంజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పారిశ్రామిక విధానం వల్ల నిరుద్యోగులు రుణం పొంది చిన్న పరిశ్రమల ఏర్పాటు ద్వారా ప్రగతి పథంలో పయనిస్తున్నారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్టేషన్ బస్తీ 20వ వార్డులో పారిశ్రామిక ప్రగతి ఉత్సవాలు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ద్వారా రుణ సదుపాయం పొందిన వారు, దళితబంధు పథకం పొందిన వారితో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో ఎంతో మంది నిరుద్యోగులు ఉన్నారని వారికి ఎలాంటి స్కిల్, శిక్షణలు లేక రుణ సదుపాయం పొందలేకపోతున్నారని తెలిపారు. ఇల్లెందులో 45 రోజుల పాటు 83 మందికి శిక్షణ ఇప్పించి రుణ సదుపాయం కల్పించామని, స్టేషన్ బస్తీలో 5 ఎకరాల స్థలం కేటాయించి అక్కడే పారిశ్రామిక కారిడార్ నిర్మాణం చేయాలని ప్రణాళిక తయారు చేశామని చెప్పారు. 15 ఏళ్లలో పూసపల్లి ఓసీ పూర్తవుతుందని, ఆ తర్వాత ఈ ప్రాంతం భవిష్యత్ ఏమిటని భావించి పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే భవిష్యత్ ఉంటుందన్నారు. రూ.30 కోట్లతో పారిశ్రామికంగా అభివృద్ధి చేయబోతున్నామని పేర్కొన్నారు. సింగరేణి వారు రెవెన్యూ వారికి 700 ఎకరాల భూమి అందజేశారని అదంతా ఇప్పుడు కబ్జాలో ఉందని తద్వారా ఏ పరిశ్రమ నెలకొల్పాలన్నా భూమి కనిపించటం లేదన్నారు. దళితబంధు పథకం ద్వారా తొలివిడతలో 100 మంది నిరుద్యోగులు రుణాలు పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, కౌన్సిలర్ లక్ష్మి, కమిషనర్ అంకుషావలీ, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ శివరాం ప్రసాద్, బీఆర్ఎస్ నేత హరిసింగ్ నాయక్, పులిగళ్ల మాధవరావు, కొక్కు నాగేశ్వరరావు, జేకే శ్రీనివాస్, సుధీర్‌తోత్లా తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో హరిప్రియ..

పట్టణంలోని స్టేషన్ బస్తీలో మంగళవారం పారిశ్రామిక ప్రగతి ఉత్సవం కార్యక్రమం నిర్వహిస్తుండగా ఆ సభకు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ తన క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో తరలివెళ్లారు. అత్యంత విలువైన ఫార్చునర్, ఇన్నోవా వాహనాలు ఉన్నా సామాన్య వ్యక్తిగా ఆటోలో వెళ్లి సభలో పాల్గొన్నారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సాదరంగా స్వాగతం పలికారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి



తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నాయికులు

ఇల్లెందురూరల్: రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ, ఆల్‌ఇండియా రెజ్లర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నబీ మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 42రోజులుగా రెజ్లర్లు జంతర్‌మంతర్ వద్ద తమ నిరసన వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేశారు. రెజ్లర్లకు మద్దతుగా దేశవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదని విమర్శించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కృష్ణవేణికి అందజేశారు. కృష్ణ, మరియ, రాంబాయి, అలేటి సంధ్య, యాకమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సీటు సాధించిన విద్యార్థులకు అభినందనలు

కొత్తగూడెంఅర్బన్: అజీమ్ ప్రేమిజీ యూనివర్సిటీ (ఏపీయూ)లో, టీఎస్ సెట్‌లో పీజీ సీటు సాధించిన విద్యార్థులను కొత్తగూడెం గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీలత మంగళవారం అభినందించారు. తెలంగాణ సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో మూడో సంవత్సరం చదువుతున్న ఏ.కీర్తి, జి.సింధు, ఓ.శైలజ అజీమ్ ప్రేమిజీ యూనివర్సిటీ పీజీలో, ఎం.ప్రణయశ్రీ టీఎస్ సెట్‌లో పీజీ సీటు సాధించారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి సహాయ సహకారాలు అందిస్తున్న కళాశాల హైయర్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ ఝాన్సీ, ఆమె టీమ్‌కు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారం తప్ప ఆచరణ లేదు..


మాట్లాడుతున్న పృథ్వీ

ఇల్లెందు: రూ.కోట్లు ఖర్చు చేసి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో ప్రచారం చాలా ఎక్కువగా ఉందని, కానీ ఆచరణలో సాధ్యం కావడం లేదని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పృథ్వీ అన్నారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన పీడీఎస్‌యూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలన్న లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో హంగు, ఆర్భాటాలే తప్ప ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయడం లేదని అందుకే ఫలితాలు భిన్నంగా ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాల కారణంగా విద్యారంగం భ్రష్టు పట్టి పోయిందన్నారు. తీవ్ర అసౌకర్యాల నడుమ పాఠశాలలు నడుస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు లేరనే కారణం చూపి 4,600 పాఠశాలలు మూసి వేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు వంశీవర్ధన్, నరేందర్, పార్థసారథి, సాయి, గంగాధర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరం


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

టేకులపల్లి: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశానుసారం మంగళవారం మండలంలోని లచ్చ తండా, శంభునిగూడెం గ్రామాలలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. 81 మందికి బీపీ, షుగర్ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో తిరిగి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత, రాబోయే వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా అనుసరించాల్సిన పద్ధతులపై ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే పాటించాలని స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, పల్లె దవాఖానా వైద్యురాలు ఇంద్రజ, సూపర్‌వైజర్ పోరండ్ల శ్రీనివాస్, వీసం శకుంతల, ఏఎన్ఎంలు పరంగిణి, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు...

కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ కార్డు పొందిన కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో రెండు రోజుల పాటు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో 110 మంది కార్మికులకు ఈసీజీ, లివర్ ఫంక్షన్, షుగర్, కొలెస్ట్రాల్, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 రోజుల తరువాత రిపోర్టులు వచ్చాక అవసరాన్ని బట్టి ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అక్బర్, మహేష్, భూక్యా లక్ష్మణ్, హెచ్ఎం బాణోతు లక్ష్మా, మూడు హుస్సేన్, భూక్యా లాలు, హెల్త్ కేర్ సిబ్బంది పాల్గొన్నారు.



అటెన్షన్ ప్లీజ్

హైవేపై పొంచి ఉన్న ప్రమాదం

బీసీఎం జాతీయ రహదారిపై ప్రమాదం పొంచి ఉంది. పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లి పంచాయతీ ఇందిరానగర్ పెట్రోల్ బంక్ పక్కన జాతీయ రహదారి కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని కోరుతున్నారు. – పాల్వంచరూరల్



ప్రశ్నించాల్సిన అధికారి : యుగంధర్, నేషనల్ హైవే ఈఈ
సెల్ నంబర్: 8333923755